తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ శుక్రవారం 13 - 03 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 2

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై

# స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్య విరుద్ధం

## బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్ బీఫాంపై పోటీ చేసినా ఫిరాయింపు కాదా
- స్పీకర్ నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలంతా తప్పుపడుతున్నారు
- స్పీకర్ వెంటనే రాజీనామా చేయాలి
- సీఎం భజన చేసుకుంటే ఏం అభ్యంతరం లేదు
- రైతుబంధు ఎగ్గొట్టి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజావారధి/మోత్కూరు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పది మంది ఎమ్మెల్యేలు బహిరంగంగా పార్టీ మారి సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారని, ఎమ్మెల్యేలు పార్టీ మారడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టు లో పిటిషన్ వేయగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించిందని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు బీఆర్ఎస్ అన్ని ఆధారాలు ఇచ్చిందని, వారు పార్టీ మారినట్టు బహిరంగంగా కనిపిస్తున్నా స్పీకర్ విడతల వారీగా విచారణ జరిపి ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే నన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ కాంగ్రెస్ బీఫాంపై ఎంపీ పోటీ చేశారని, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కూతురు ఎంపీగా పోటీ చేస్తే కాంగ్రెస్ కండువా కప్పుకుని ఆయన ప్రచారం చేశారని, అది పార్టీ ఫిరాయింపు కాదా అని, బహిరంగంగా కనిపిస్తున్నా దానిని గుర్తించ కుండా స్పీకర్ తీర్పు ఇవ్వడం అన్యాయ మన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల పట్ల స్పీకర్ ఇచ్చిన తీర్పును తెలంగాణ ప్రజలంతా తప్పు పడుతున్నారని, పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగి నన్ను ఎవరూ చూడలేదన్న విధంగా స్పీకర్ వ్యవహరించడం సిగ్గుచేట న్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించా ల్సిన స్పీకర్ ఆ పదవికి అనర్హుడని, ఆయన వెంటనే రాజీనామా చేసి సీఎం భజనపరునిగా ఉంటే ఎవరికి అభ్యంతరం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో తెలంగాణను అన్ని విధాలా దివాళా తీయిం చిందన్నారు. రైతుబంధు ఎగ్గొట్టి రైతులను మోసం చేశారని, రైతులకు సకాలంలో యూరియా అందించకుండా అరిగోస పెడుతున్నారని తెలిపారు. రైతులు, ప్రజలు అన్ని గమనిస్తున్నారని, సరైన సమయంలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.